జాలిపడటం వేదుకదా!

రమాదేవి.,

సుబ్రహ్మణ్యం నుంచున్నాడు. స్టాఫ్‌రూమ్ గుమ్మంలో కమ్మి పట్టుకుని. కొంచెం దూరంలో 'లాబ్స్' వైపుగా ఫిజిక్స్ లెక్చరర్ మూర్తితో కబుర్లు చెబుతున్నట్లుగా నెమ్మదిగా ప్రక్కనే నడుతున్నట్టుగా విజయ కనపడింది. ఏదో మాటకి అతని వంక చూసి గట్టిగా నవ్వింది మధ్యలో విజయ.

'ఈ మధ్యనే క్రొత్తగా వచ్చిన మూర్తితో అంత పరిచయం ఎక్కడిది విజయకి, అంత చనువుగా ప్రక్కనే నడుస్తూ నవ్వుతూ వెళుతోంది. అని ఆలోచనలో పడ్డాడు సుబ్రహ్మణ్యం. అస లెందుకు అంత గట్టిగా నవ్వింది విజయ. తనకు వినపడాలనా......ఒకవేళ తనని చూసే నవ్విందా? తప్పకుండా తనని చూసే హేళనగా నవ్వివుంటుంది. తానొకసారి ''మూర్తి అంత మంచివాడులా కనపడటం లేదు.'' అంటే, ''లేదండీ. మంచివారి యనలాగానే కనబడుతున్నారు నాకు'' అంది మొండిగా.... తనని ఏడిపించడానికే అలా అన

ఎదుట అతనితో ప్రక్కనే నడుస్తూ వెళ్ళింది అనుకుని చికాకు పడ్డాడు లోలోన సుబ్రహ్మణ్యం. "ప్రిన్సిపాల్‌గారెందుకో రమ్మంటున్నారయ్యా" అంటూ వచ్చాడు ప్యూన్ ఇంతలో. "ఈయనకి ఇప్పుడే పనొచ్చిందే నాతో...ఛీ వెధవ ఉద్యోగం దరిద్రపు మనుష్యులు" అనుకుంటూవెళుతున్న సుబ్రహ్మణ్యానికి 'లాబ్స్' ప్రక్కనేఉన్న కాంటీన్ లోనించి విజయ నవ్వు వినపడింది. నాలుగడుగులు ముందుకేయగానే విజయ ప్రక్కనే కూర్చున్న మూర్తి కనపడ్డాడు. 'గాడ్....ఇక్కడా వీళ్ళేనే' అనుకుంటూ గబగబా ముందుకు నడిచాడు ఏదో చీదర వేసినట్టు. అదే వూపులో గబాలున తలుపు నెట్టుకుని ప్రిన్సిపాల్‌గదిలోకి వెళ్ళాడు.

"ఏం ఒంట్లో బావుండలేదా అలా ఉన్నారు." అన్నాడు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యాన్నిచూడగానే. "ఏం లేదు.కొంచెంఒంట్లో నలతగా ఉంది.ఏడాదికేడాది పైన పడ్డకొద్దీ ఆరోగ్యం సరిగా వుండదుగా" అన్నాడు సుబ్రహ్మణ్యం తాను ప్రిన్సిపాల్ కంటె వయస్సులో పెద్దవాడిననేది గుర్తు చేస్తున్నట్టుగా. సుబ్రహ్మణ్యం వయస్సులో తనకంటే పెద్దవాడని, ఆ కాలేజీలో చాలా ఏళ్ళుగా అనుభవం కలిగిఉన్నవాడని, ఆమధ్యనే ట్రాన్స్ఫరయి క్రొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్‌కి గౌరవం. ప్రతి విషయంసాధారణంగాసుబ్రహ్మణ్యంతో సంప్రదిస్తూ ఉంటాడు. ముఖ్యంగా కాలేజీలో జరిగే ఫంక్షన్ విషయంలో సుబ్రహ్మణ్యం సలహా తీసుకోకుండా ఉండడు ప్రిన్సిపాల్.

"దేనికి పిలిపించింది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఇందాక విజయ, మూర్తి వచ్చి వెళ్ళారు" అన్నాడు ప్రిన్సిపాల్.

"ఓ గాడ్" అనుకున్నాడు సుబ్రహ్మణ్యం లోన.

"ఈ సారి ఓల్డు స్టూడెంట్సు గాదరింగుకి మూర్తి రాసిన నాటకం వేస్తున్నారట. సెట్టింగ్సుకీ వాటికీ నూట యాభై రూపాయలయినా అవుతాయట..... మీరేమంటారు" అన్నాడు ప్రిన్సిపాల్.

"నేననేదేముంటుంది. మీ యిష్టం....కాని ఒక్కనాటకానికే నూట యాభై రూపాయలు ఖర్చుపెడితే మిగతా ఖర్చుమాటేమిటి.....డబ్బు సరిపోతుందా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అదే నేనూ అన్నాను. విజయ వక్కతే డెలిగేట్ పాస్‌లతో మూడువందలకు పైగా పోగు చేసిందట. మిగతా వాళ్ళంతా కలిసయినా కనీసం మరో వందలన్నాపోగుచేసి వుంటారట. టీపార్టీకేమయినా కొద్దోగొప్పో తక్కువ పడితే ఒకవేళ ఖర్చు ఎక్కువ అయి, మళ్ళీ విజయ పోగుచేసి ఇస్తానంది" అన్నాడు ప్రిన్సిపాల్ సమాధానంగా.

"అయితే సరే..ఇంతకీ మూర్తినాటకమే వేయాలని మాత్రం ఏముంది. తక్కువ ఖర్చులో అయ్యే నాటకాలు కొరత లేదుగా మనకి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మూర్తి నాటకం స్టేజిమీద సులభంగా [illegible]

నాటకాల సంగతి తెలియదు. మీరు చదివి చూడండి ఒకసారి" అన్నాడు ప్రిన్సిపాల్.

"దానికేముంది. అతను బాగానే వ్రాసి ఉండవచ్చు.....ఇంతకీ ఎవరెవరు వేస్తారట......టైమ్ దగ్గరకు వచ్చిందికూడా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నాలుగే కారక్టర్స్ ఉన్నాయట. హీరోయిన్ విజయ. హీరో సుదర్శన్...ఈవినింగు కాలేజీలో పనిచేస్తున్నాడట. మీకు తెలిసే ఉంటాడు. మీ ఓల్డు స్టూడెంటేనట. మిగతా రెండూ ఇంకా ఎవరెవరో వేస్తారట" అన్నాడు ప్రిన్సిపాల్.

"ఓ.....అయితే అంతా నిర్ధారణ అయిపోయిందన్నమాట. ఇక ఇప్పుడు నా అభిప్రాయముతో అవసరం ఏముంది. కానీయమనండి. చిన్నవాళ్ళు ఉత్సాహపడుతున్నారు" అన్నాడు. పైకి కృత్రిమంగా పెదవి విరుచుకుని నవ్వుతూ లేచి నిలబడి.

"మీ ఆరోగ్యం సరిగా చూసుకోండి" అన్నాడు ప్రిన్సిపాల్.

"థాంక్స్ వస్తాను" అంటూ సుబ్రహ్మణ్యం తలుపుతోసుకుని బయటకు వచ్చాడు. కాంటీన్‌లో బహుశా విజయ, మూర్తి కూర్చొని ఉంటారేమో, వాళ్ళిద్దర్నీ అలా కూర్చొని ఉండగా చూడవలసి వస్తుందేమో నన్న భయంతో అటు వైపు వెళ్ళకుండా, రెండో వైపునుంచి తెలుగు ఎసోసియేషన్ రూమ్‌ను దాటి, నడుస్తున్నాడు తల వంచుకొని ఏదో ఆలోచించుకుంటూ సుబ్రహ్మణ్యం.

"నమస్కారమండీ" అన్నమాట విని తటాలున తల ఎత్తి చూశాడు సుబ్రహ్మణ్యం. ఎదురుగా సుదర్శన్ గ్రేకలర్ సూట్‌లో...స్టేజీమీద రంగుల్తో ఉన్నప్పుడు ఎంత అందంగా కనపడ్తాడో అంత అందంగానూ కనపడ్డాడు. సుదర్శన్, నాటకంలో హీరోలా అతని ప్రక్కని విజయని హీరోయిన్‌గా అనుకోకుండానే వూహించుకున్నాడు సుబ్రహ్మణ్యం. ఒళ్ళంతా మంటలు రేగాయి.

"ఏమిటోయ్ సంగతి. ఇలా వచ్చావ్" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"విజయ కబురు పెట్టింది, ఏదో నాటకంలో వేయాలని రమ్మని" అన్నాడు సుదర్శన్.

"ఓహో.....మూర్తితో కలిసి కాఫీ తీసుకుంటున్నట్టుంది విజయ కాంటీన్‌లో. మూర్తి నాటకం చాలా బాగా వ్రాసాడని అందట విజయ" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అవునట. అలాగే అంది విజయ నాతోకూడా నేనింకా చదవలేదు" అన్నాడు సుదర్శన్.

"అంత ఖర్చుపెట్టి ఆనాటకం వేయకపోతేమీ ఓల్డు స్టూడెంట్సు వ్రాసిన నాటకమేదైనా వేయొచ్చుగా".

"బహుశా ఆయన చాలా బాగా వ్రాసి ఉండకపోతే విజయ ఆనాటకం తీసుకుని ఉండదు"

"మీ అందరికీ అమాత్రం నమ్మకం విజయలో. ఉంటేమంచిదే.... ఎక్కువటైముకూడా లేదు. [illegible]

చేసుకోవచ్చు కూడా".

"మాశాయశక్తులా ప్రయత్నిస్తాం. అక్కడికీ సరిగా నడవక పోతే ఎవరు మాత్రం చేయగలిగిందేముందండి.....అయినా మూర్తి గారు కూడా అలా వేరేగా తీసుకోరనుకుంటాను".

"ఏం నీకు కూడా బాగా పరిచయమా అతను"

"లేదండీ.... క్రిందటేడు ఇంటర్ యూనివర్సిటీ డిబేట్ కాంపిటేషన్స్‌ప్పుడు కలిసారు అప్పటి పరిచయమే".

"సరే... వెళ్ళిరా. విజయమూర్తి వెయిట్ చేస్తున్నారేమో నీకోసం" అని సబ్రహ్మణ్యం గబగబా స్టాఫ్ రూమ్ వైపుగా వెళ్ళాడు. బి. ఏ. స్టూడెంట్స్ ఇద్దరు స్టాఫ్ రూమ్‌లోకి వస్తే "ఇవాళ క్లాసు తీసుకోను. ఒంట్లో అంత బాగా లేదు" అని చెప్పి పంపేసి ఒక్కడే అంత పెద్ద గదిలో కూర్చున్నాడు కాసేపు—ఇంతలో తెలుగు లెక్చరర్ ప్రమీల వచ్చి "నమస్కారం మేష్టారు" అంది చేతిలో పుస్తకాలు బల్లమీద పెడుతూ.

"కూర్చోవమ్మా కూర్చో....ఈపీరియడ్ ఖాళీయా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అవునండి. కనీసం నేనో యాభై రూపాయలైనా పోగు చేయాలంది విజయం. ఇంక పది రూపాయిలు మాత్రమే తక్కువ. ఫ్రెండ్సు దగ్గరికి వెళ్దాం ఈ టైములో అనుకుంటున్నాను ఇప్పుడే" అంది ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ ప్రమీల.

"ఏమిటి భారీ ఎత్తున చేస్తున్నట్టున్నారే ఫంక్షన్"

"ఈ కాలేజిలో చదివిన వాళ్ళమి చాలామందిమి ఈ వూర్లో కాలేజీలలోనే లెక్చరర్సమయ్యాము కదండీ! ఈ సంవత్సరం అందరమూ కలిసి సరదాగా చేద్దాం అనుకున్నాను. ముందు ముందు రొటీన్‌లో పడితే ఏం చేయలేకపోవచ్చుకదండీ"

"నిజమే.... నిజమే. నాటకం కూడా వేస్తున్నారట. దాన్లో నువ్వేమీ వేయడం లేదా?"

"లేదండి. ఒక్కటే స్త్రీపాత్ర. అది విజయ వేస్తోంది. నాకసలే భయం స్టేజి ఎక్కాలంటే... ఎప్పుడో ఒక్కసారి కాలేజి నాటకంలో విజయతో పాటు వేసాను పట్టు బలవంతం మీద".

"అయితే మాత్రమేం. దీన్లోనూ వేయొచ్చుగా. విజయ వెయ్యమని అడగలేదూ మరి"

"అడిగింది కాని నేనే వెయ్యనన్నాను.. నేనసలు వెయ్యలేనండీ"

"వెయ్యలేక పోవడానికి అంత బ్రహ్మాండం ఏముంది. అసలు విజయ గట్టిగా అడగలేదేమో. డబ్బు పోగుజేసేవరకు మీరందరూ కావాలి. పేరు తనకి రావాలి. చాలా తెలివైంది విజయ".

"మొదటినుంచి విజయ సుదర్శన్ ఎక్కువ ఇల్లాంటి విషయాల్లో కలుగ జేసుకునేవారు కదండీ. అందుకనే ఈసారి కూడా ఈ విషయమంతా వాళ్ళకే వదిలేసామండి!

"పెత్తనం వాళ్ళకి వదిలినా, పని మీరే

నాటకం నువ్వు చదివావా''?

''చదివాను. బావుందండీ. అయినా మన వాళ్ళని మనమే ప్రోత్సహించుకోక పోతే ఎలాగండీ''

''అదీ నిజమే.... నువ్వుకూడా వ్రాస్తావు కదమ్మా.... మూర్తిదే ఎందుకు వేయవలసి వచ్చింది. అతను ఈ యూనివర్సిటీ స్టూడెంట్ కూడా కాదుగా''.

''ఈ స్టూడెంట్స్ వ్రాసిన నాటకమే వేద్దామని నియమం పెట్టుకోలేదండీ... మూర్తిగారిది ఇంతవరకూ ఎవరూ వేయలేదు. అందుకని విజయ అడిగి తీసుకుంది''.

''పబ్లిష్ అయిందా''?

''లేదండి... మాన్స్క్రిప్ట్సు తీసుకుంది మొన్న నాయన స్టాఫ్‌రూమ్‌లో కూర్చుని చివరి అంకం వ్రాసుకుంటున్నారట. విజయచూసి అడిగి పుచ్చుకుని చదివి నాకిచ్చింది. నన్నుకూడా చదవమని''.

''అలా చెప్పు. మూర్తికి విజయకి బాగా స్నేహం కలిసిందన్నమాట'' అని అర్థయుక్తంగా నవ్వాడు సుబ్రహ్మణ్యం.

''నమస్కారం సర్'' అంటూ లోపలికి వచ్చాడు మూర్తి ఇంతలో.

''ఓ.... రావోయ్ కూర్చో.... అన్నాడు సుబ్రహ్మణ్యం''. విజయ సుదర్శన్ బయట తలుపుకెదురుగా నిలబడి మాట్లాడుకుంటూ కనపడ్డారు సుబ్రహ్మణ్యానికి. చూసీ చూడనట్టుగా అటేచూస్తూ కూర్చున్నాడు సుబ్రహ్మణ్యం. మొత్తానికి ముగ్గురిలో ఎవరూ పెదవి మెదపలేదు. విజయ సుదర్శన్ ప్రిన్సిపాల్‌రూమ్ వైపుకు వెళ్ళటం కనిపించింది. ఇంతలో విజయ ఎందుకనో వెనక్కు తిరిగి ఏదో మర్చి పోయినట్టు స్టాఫ్‌రూమ్‌లోకి వచ్చింది. వస్తూనే ''నమస్కారమండీ'' అంది సుబ్రహ్మణ్యాని చూసి.

''ఆ....ఆ......రా......అమ్మా.....కూర్చో.. ఏదో నాటకం వేస్తున్నారట'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''అసంగతే చెబుదామని వచ్చానండి'' అంది విజయ.

''మీసలహా కావాలండీ..... రిహార్సల్సవీ మీరు చూస్తారని అనుకుంటున్నాం'' అన్నాడు మూర్తి

''నా కెక్కడ కుదురుతుందోయ్. ఒంట్లో బావుండటంలేదు. విజయ సుదర్శన్ వేస్తుంటే ఇంకా వేరే ఒకళ్ళు చెప్పాల్సిందేముంటుంది. విజయ చాలా తెలివైంది. అన్నీ తనే చూసుకో గలదు. అని మూర్తితో అని ''ఏవమ్మా'' అంటూ ఒకనమాదిరిగా కనుబొమల క్రింద నుండీ నవ్వుతూ చూసాడు. విజయ వంక.

''ప్రిన్సిపాల్‌గారు రమ్మంటున్నారమ్మా'' అంటూ వచ్చాడు ప్యూన్.

''ప్రమీలా....నువ్వు కూడా రా.... బహుశా ఫంక్షన్ విషయం మాట్లాడటానికే అయి వుంటుంది'' అంటూ ప్రమీలను తీసుకుని విజయ వెళ్ళిపోయింది.

''కనీసం ఒక్కసారి నాటకం చదివి సలహా లేమైనా ఇస్తే మార్పులవీ చేస్తాను అవసరమయితే'' అన్నాడు మూర్తి.

''ఫరవాలేదోయ్...... మార్పులు చేయాల్సిన అవసరమేమీ ఉండదు. విజయ చదివిందేమోకదా ఏమంది?''

''ఈ నాటకం మేం తప్పకుండా వేస్తాం' అన్నారు'' అన్నాడు మూర్తి.

''ఓహో! అందుకనా ఎలాఉన్నా మన వాళ్ళని మనం అన్నా ప్రోత్సహించుకోక పోతే ఎలాగ అన్న ఉద్దేశంతో విజయ మూర్తిగారి స్క్రిప్ట్ తీసుకుంది'' అన్నట్టుగా అంది ప్రమీల'' అన్నాడు సుబ్రహ్మణ్యం కొంచెంగా నుదురు చిట్లించి, తనకిష్టం లేకపోయినా ఆమాట చెప్పవలసి వచ్చిందన్నట్టుగా.... కనుబొమల క్రిందినుంచి మూర్తి ముఖకవళికలలో ఏమైనా మార్పు వస్తోందేమోనన్నట్టుగా పరీక్షగా చూసాడు కొన్ని క్షణాలు. మూర్తి ఏదో ఆలోచనలో పడ్డట్టుగా కూర్చున్నాడు.

''వస్తానోయ్ మూర్తి...నాటకం విషయంలో భయపడకు. సుదర్శన్ విజయ జోడీ అయితే బాగా నటిస్తారులే'', అని మూర్తి భుజంతట్టి సుబ్రహ్మణ్యం కాలేజి గేటు వైపుగా వెళ్ళిపోయాడు. రిక్షాలో ఇంటికి వెళదామనుకున్న సుబ్రహ్మణ్యం, బస్‌స్టాప్ దగ్గర నిలబడి ఉన్న సుదర్శన్‌ని చూసి, అది విరమించుకుని తానూ బస్‌స్టాప్ దగ్గరకు వెళ్ళాడు రోడ్డు క్రాస్‌చేసి.

''ఏమోయ్ సుదర్శన్..... రిహార్సల్సు ఎప్పటి నుంచి మొదలు పెడుతున్నారు? విజయని కలుసుకున్నట్టున్నావ్?''అన్నాడు సుబ్రహ్మణ్యం.

''రేపటి నుంచండి'' అన్నాడు సుదర్శన్.

''అయితే మూర్తి నాటకమే వేయడం ఖాయమన్నమాట. మూర్తి కూడా వేస్తున్నాడా నాటకంలో''.

''లేదండీ.. నేనూ ఆయన్ని వెయ్యమన్నాను, మాకాలేజీనుంచి ఇక్కడికి రిహార్సల్సుకు రావాలంటే కష్టం అని...... మూర్తిగారొప్పుకో లేదు''.

''మరి రోజూ నువ్వు రిహార్సల్స్‌కి రాకపోతే విజయ ఫూరుకోదేమో..... నీకు అందరికంటే ఎక్కువ రిహార్సల్స్ అవసరం అంటుంది కదూ''

''నిజమేనండీ. నాకు పోర్షన్ సరిగా రాదు. రిహార్సల్సన్నా ఎక్కువ చేస్తే గుర్తుంచుకుంటానని అంటూరావిడ'' అన్నాడు నవ్వుతూ సుదర్శన్.

''పోనీ అంత నీతో ఇబ్బందిగా ఉంటుందనుకుంటే మూర్తినే వెయ్యమని మొహమాట పెట్టక పోయిందా. విజయ గట్టిగా అడిగితే మూర్తి కాదనలేడుగా'' అన్నాడు సుబ్రహ్మణ్యం. సుదర్శన్ ఇంకేమీ మాట్లాడలేదు. ''వస్తానోయ్..... బస్ ఇప్పుడప్పుడే వచ్చేటట్టు లేదు. రిక్షాలో పోతాను. ఒంట్లో బాగోలేదు కూడ'' అని రిక్షా మాట్లాడుకుని వెళ్ళి పోయాడు సుబ్రహ్మణ్యం.

నిజంగానే జ్వరం వచ్చి సుబ్రహ్మణ్యం నాలుగు రోజులు కాలేజీకి సెలవు పెట్టాడు. బహుశా రిహార్సల్సు మొదలయి ఉండవు కాలేజీలో అనుకున్నాడు. ఒకవేళ మూర్తి స్క్రిప్టు ఇచ్చినా, తనమాటలు విన్నాక సుదర్శన్ రిహార్సల్స్‌కు వెళ్ళి ఉండడు అనుకున్నాడు. జ్వరం వచ్చి ఇంట్లో కదలకుండా పడుకుని ఉన్నాడన్నమాటేగాని, మనస్సు పరిపరి విధాల పోయింది. విజయ తనని ఉపేక్ష చేస్తోందనా!..... లేకపోతే విజయ మూర్తితో, సుదర్శన్‌తో చనువుగా ఉంటోందనా తనకీ అనుకోలేని బాధ..... తనని ఉపేక్ష చేసినా భరించ గలడుకాని, విజయ సుదర్శన్ ప్రక్క ప్రేయసిగా నేసినా, మూర్తితో అతని నాటకాన్ని ప్రశంసిస్తూ అతని ప్రక్కన కూర్చున్నా తాను భరించలేడు. విజయ శ్రేయస్సు కోరేవాడే తాను. అందుకేగా ప్రిన్సిపాల్ సెలవులో ఉండటంవల్ల ఇంటర్వ్యూ కమిటీలో తనూ ఒక మెంబరుగాఉండి విజయ వెంటనే అదే కాలేజీలో లెక్చెరరవడానికి తోడ్పడ్డాడు. విజయ ఆసంగతి గుర్తించినట్టు కనపడదు. కేవలం తన ఫస్టు క్లాసే కారణం అనుకుంటోందేమో..... విజయ తన స్టూడెంట్‌గా ఉన్నప్పుడు కూడ తెలివైందని ఎంతో అభిమానం చూపి, అన్ని విధాలా ప్రోత్సహిస్తూ ఉండేవాడు. అందుకనైనా కృతజ్ఞతగా ఉండొచ్చుగా. ''విజయ అంటే సుబ్రహ్మణ్యం గారికి ఇంతటి ప్రత్యేకాభిమానమేమిటి'' అని కొందరు కుర్ర లెక్చరర్లు, స్టూడెంట్స్ నవ్వుకోవడం గుర్తుకొచ్చింది. ఎందుకో సుబ్రహ్మణ్యానికి అలా విజయని తనతో కలిపి నవ్వుకుంటే హాయిగానే అనిపించేది. కోపం వచ్చేది కాదు..... ఇలా ఆలోచించుకుంటూ జ్వరంతో పడుకుని ఉన్న సుబ్రహ్మణ్యానికి ఆలోచనలతో కూడా బుర్రవేడెక్కి ''విజయ ఏం చేస్తే నాకెందుకు. ఏవెధవతో తిరిగితే నాకెందుకు'' అని ఆలోచనల్ని తరిమేస్తున్నట్టుగా గట్టిగా తలపట్టుకు పడుకున్నాడు.

అయిదవరోజు జ్వరం తగ్గి కాలేజీకి వెళ్ళాడు సుబ్రహ్మణ్యం. చూడగానే ప్రిన్సిపాల్ ''ఆరోగ్యం ఎలా వుంది''అనిఅడిగాడు. ఇంకా స్టాఫ్‌ని పెంచడం విషయం మాట్లాడాడే కాని, ఫంక్షన్ సంగతి ఎత్తలేదు. సుబ్రహ్మణ్యం కూడా తనకు తానై ఆసంగతి ఎత్తలేదు. బహుశా ఫంక్షన్ ఆగిపోయి ఉంటుందన్న తృప్తితో ప్రిన్సిపాల్ రూమ్‌నుంచి బయటకు వచ్చాడు. విజయ, మూర్తి, వరండా చివర నిలబడి నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. విజయ ఎందుకో నవ్వింది. ముభావంగాఉండే మూర్తికూడా గట్టిగా నవ్వాడు. సుబ్రహ్మణ్యానికి ఎవరో వీపు చెళ్ళుమనిపించినట్టయింది. 'అయితే మూర్తి, విజయ స్నేహంగానే ఉన్నారన్నమాట . మూర్తితో తనన్నమాటలన్నీ తప్పకుండా విజయతో చెప్పేఉంటాడు..... ఓ.....గాడ్..... కానీ చూస్తాను..

అనుకుంటూ యుద్ధానికి సన్నద్ధుడైనట్టుగా వాళ్ళవైపుకు నడిచాడు. విజయ మూర్తి ఒకేసారి 'నమస్కారమండీ'' అన్నారు. ''ఏమోయ్ రిహార్సల్స్ ఎలానడుస్తున్నాయ్'' అని అడిగాడు మూర్తిని సుబ్రహ్మణ్యం.

''బాగానే సాగుతున్నాయంటున్నారు విజయగారు. నాకాట్టే ఆ విషయాలు తెలియవు.... నేను వెళ్ళడం లేదండి'' అన్నాడు మూర్తి. ''అదేమిటి నువ్వు హీరోగా వేస్తున్నావని అన్నట్టున్నాడు సుదర్శన్'' అన్నాడు సుబ్రహ్మణ్యం ఏదో గుర్తు తెచ్చుకుంటున్నట్టు. ''లేదండీ మొదటినుంచి సుదర్శన్ గారే వేయాలని అనుకున్నాం'' అన్నాడు మూర్తి. ''ఓహో అయితే సుదర్శనే వేస్తున్నాడన్నమాట. ప్రమీల వేస్తోందా హీరోయిన్‌గా'' అన్నాడు మళ్ళీ సుబ్రహ్మణ్యం ఏమీ తెలియనట్టుగా. ''లేదండీ. విజయగారే వేస్తున్నారు'' అన్నాడు మూర్తి. విజయవైపుగా చూపులు తిప్పి ''ఏమమ్మా చెప్పనేలేదే'' అన్నాడు సుబ్రహ్మణ్యం ఉక్రోషంతో విడవలేక నవ్వినట్టు నవ్వుతూ. ',మీరీమధ్య కాలేజీకి రావడం లేదు కదండీ..... సందర్భపడలేదు..... ఇంతకీ మీ ఒంట్లో ఎలా వుంది'' అంది విజయ. ''థాంక్స్ బాగానే ఉంది. ఫంక్షన్‌కి పిలుస్తారుగా నన్ను'అన్నాడు పెదవివిరిచి నవ్వుతూ సుబ్రహ్మణ్యం.

''మీరే అధ్యక్షత వహించాలని మేమందరం కోరుకుంటున్నాం. ఈ వేళ మీరు కాలేజీకి రాకపోతే మీఇంటికి వద్దామని అనుకున్నాం'' అన్నాడు వెనకవైపునుండి వస్తూ సుదర్శన్.

''నా కెక్కడ కుదురుతుందోయ్ నాకు ఒంట్లో బావుండటం లేదుకూడా. కానీయండి చాలా ఉత్సాహంగా జరుపుతున్నారు....వస్తానోయ్ మరి'' అని ప్రోత్సహిస్తున్నట్టుగా ఒక వంకర నవ్వు నవ్విముందుకునడిచివెళ్ళాడుసుబ్రహ్మణ్యం ముందుకు నడుస్తున్న సుబ్రహ్మణ్యానికి తన వీపు వెనుక వాళ్ళు ముగ్గురూతనని చూసినవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూన్నట్లనిపించింది. ఆముగ్గురూ తనని వెంట తరుముతున్నట్టుగా గబగబా క్లాస్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ఏదో పాఠం అలవాటు చొప్పున చెప్పుకుపోతున్నాడేకాని మనసక్కడలేదు. మధ్యలోనే క్లాసు వదిలేసి వచ్చేసాడు. దోవలో విజయ ఒక్కతే లాబ్స్ వైపుగా వస్తూ ఎదురు పడింది. విజయతో ముఖాముఖి ఏదో తేల్చేసుకుందామనుకున్నాడు.ఇంతకీ తేల్చుకోవలసిందేమిటో తనకే తెలియడంలేదు మళ్ళీ. తనకే అదోలా అనిపించింది. విజయకోసమే ఆగినట్టుగా ఆగిపోయాడు కూడా. విజయ దగ్గరకు రాగానే ''ఏమమ్మా చాలా శ్రమపడుతున్నట్టున్నావ్. చిక్కిపోయావ్ చాలా'' అని పరామర్శించాడు సుబ్రహ్మణ్యం.

''అబ్బే శ్రమేం లేదండీ. ఈసారి పనంతా మూర్తిగారు, సుదర్శన్ చూసుకుంటున్నారు'' అంది విజయ. ''గాడ్....విజయనోటకూడా వీళ్ళ పేర్లే'' అని లోన అనుకుని ''కాఫీ తీసుకుని వెళుదువుగాని రావమ్మా కాంటీన్‌లో'' అన్నాడు కనీసం అక్కడ విజయ మాటలతో కవ్వించి ఏడ్పేటట్టు చేద్దామన్న కసితో.

''సారీ.... వాళ్ళంతా రిహార్సల్సుకోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఈవేళ సెట్టింగ్సు విషయం మాట్లాడటానికి మూర్తిగారిని కూడా రమ్మన్నాం రిహార్సల్స్‌కి'' అంది విజయ చాలా మామూలుగా.

'మూర్తి, సుదర్శన్ తను వాళ్ళతో అన్న మాటలు బహుశా విజయకు చెప్పలేదేమో అనుకున్నాడు ఒక్క క్షణం సుబ్రహ్మణ్యం. 'ఒకవేళ చెప్పినా వాళ్ళని కన్విన్స్ చేసి, తనదగ్గరఆ విషయాలేమీ తెలియనట్టుగా ప్రవర్తించి, వాళ్ళిద్దరూ తనతో చాలా సహకరిస్తున్నట్టుగా చెప్పి తనమీద దెబ్బతీస్తోందేమో అనుకున్నాడు మరుక్షణం. ఇది మరీ భరించలేక పోయాడు. 'కనీసం తను వాళ్ళిద్దరితో అలా చెప్పినందుకు విజయ తనతో దెబ్బలాడినా బావుండును. కాని విజయ తననిలా మౌనంగా ఓడిస్తే భరించటం కష్టం' అనుకున్నాడు. ''ఫరవాలేదు లేవమ్మా.... రిహార్సల్సుకి పది నిముషాలు ఆలస్యమయితే కొంపలు మునిగిపోవు'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''అదేం లేదనుకోండి. మీకు తెలీయందేముంది మన కాంటీన్ సంగతి. మనని కూర్చోబెట్టి అప్పుడు కుంపటి వెలిగిస్తాడు. ఆలస్యమవుతుందండి. మళ్లా లాస్ట్ పీరియడ్ నాకు క్లాస్ ఉంది కూడ. ఈ లోపున ఒక్క రిహార్సలన్నా అయితే'' అంది విజయ. ''అయితే రిహార్సల్సు జోరుగా సాగుతున్నాయన్నమాట...ఎందుకైనా మంచిది. కాస్త జాగ్రత్తగా ఉండు. లాస్ట్ మోమెంట్‌లోనిన్నువీళ్లు ఇబ్బందిపాలుచేయొచ్చు'' అన్నాడుసుబ్రహ్మణ్యం హితబోధ చేస్తున్నట్టుగా ''అలాంటి భయమేమీలేదండీ. వాళ్లసంగతి నాకు, నాసంగతి వాళ్లకి బాగా తెలుసు.'' అంది విజయ. 'అయితే నాకేనన్నమాట వీళ్లసంగతి తెలియంది' అని లోలోపల అనుకుని ''ఆనమ్మకం ఉంటే ఫర్వాలేదు. . . ఇంతా కష్టపడి, చివరికి వాళ్లు సహకరించక ఏమన్నా స్కాండల్స్ వస్తే ప్రిన్సిపాల్ ఏమైనా అనుకోవచ్చుననే ఉద్దేశ్యంతో అన్నాను. నాకళ్లముందటి దానివి, ఇంతధైర్యంగా, ఒంటరిగా ముందుకు వెళ్లగలుగుతున్నావంటే నాకు చాలఅబ్బురంగా ఉంది'' అన్నాడు సుబ్రహ్మణ్యం. ''ఒంటరిగా ఏముందండీ. మీ అందరి సహకారంతోనే నేను ఏదైనా చేయగలుగుతున్నాను. ..అయినా ఇదంతా మీచలవేగా'' అని చిన్నగా నవ్వి వెళ్లిపోయింది. ఆ నవ్వు ఎందుకో సుబ్రహ్మణ్యానికి తనని వెక్కిరించినట్టుగా అనిపించింది. ''నువ్వెంతతో అతి తెలివిగా ఎన్నెన్ని ఎక్కాలు చెప్పినా వాళ్ళెందరూ చివరికి నాపక్షమే'' అన్నట్టుగా ధ్వనించిందే ఆ నవ్వు' అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

''నీ బలహీనతను క్షమించానులే'' అన్నట్టుగా ఉన్నాయే నవ్వుతూ ఉంటే ఆ కళ్ళు. . .

ఓ. గాడ్!కొంపదీసి నన్నుచూసి జాలిపడడం లేదుకదా విజయ!''. . .అలా అని తట్టగానే కళ్ళు తిరిగినట్టయి వరండా స్తంభానానుకుని నుదుర చేతో పట్టుకొని నిలబడి పోయాడు సుబ్రహ్మణ్యం.

★

ముక్తి

మదిలోపలి ఇరుకు గదుల
ముదిరిన చీకట్లనుంచి
రుధిరధార హోరెత్తిన
క్షుభిత హృదయ వీధినుంచి

అందని ఛందం కోసం
కందని అందం కోసం
ఆనంద తీరాల దరికి
గంధాల పవనాల తరలి
అంబుధి నీలాంబరాన్ని
చుంబన చేసే తావులు
వేయిరేకులను విప్పిన
వెలుగుల తామర కొలనులు
దరియు కొలది దూరంగా
పరుగు తీసే రేవులు

ఏ నాదో? ఏ తావునో?
ఏ పిలుపో? ఏ వెలుగో?
ఏ వలపో? ఏ తలపో?
ఏ పదనమో? ఏ సదనమో?

దొరకని మౌక్తికము కొరకు
నోరు తెరిచి కలలపరిచి
తరగలపై తేలు శుక్తి
ధరలో మానవుని వ్యక్తి

అమరేంద్ర